క్లుప్తంగా

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

దేవరపల్లి: ఉపాధి హామీ పథకం పనులపై మండల స్థాయి సామాజిక తనిఖీ ప్రజావేదిక గురువారం ఉదయం 10 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహిస్తామని ఎంపీడీఓ డీబీఆర్ కృష్ణంరాజు బుధవారం తెలిపారు. ఏప్రిల్ 01, 2022 నుంచి మార్చి 31, 2023 వరకూ మండలంలో నిర్వహించిన 16వ విడత జాతీయ గ్రామీణ ఉపాధి పనులపై ఈ ప్రజావేదిక జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండలంలోని సర్పంచులు, ప్రజాప్రతినిధులు, ఉపాధి హామీ క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొనాలని ఆయన కోరారు.

పట్టణంలో ముగిసిన గడప గడపకూ..

కొవ్వూరు: నూరు శాతం సంక్షేమ పథకాల ద్వారా అర్హులందరికీ లబ్ధి చేకూరుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. పట్టణంలోని 22వ వార్డులో బుధవారం రాత్రి నిర్వహించిన 133వ రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. మంత్రి ఇంటింటికీ వెళ్లి ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాగా బుధవారంతో పట్టణంలోని అన్నీ వార్డుల్లోనూ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని పూర్తి చేసినట్టు మంత్రి ప్రకటించారు. మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, జెడ్పీ వైస్ చైర్ పర్సన్ పోసిన శ్రీలేఖ, మునిసిపల్ వైస్ చైర్ పర్సన్‌లు మన్నె పద్మ, గంధ్రోతు అంజనీదేవి తదితరులు పాల్గొన్నారు.

నగదు రహిత చెల్లింపులకు మూడు పేటీఎం మెషీన్‌లు

కొవ్వూరు: స్త్రీ నిధి క్రెడిట్ కో–ఆపరేటివ్ ఫెడరేషన్ బ్యాంకు ద్వారా వచ్చే రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. గ్రామ మహిళా సంఘాల సభ్యులు నగదు రహితంగా స్త్రీ నిధి రుణాలు చెల్లించేందుకు వీలుగా మూడు పేటీఎం మెషీన్‌లను ఫెడరేషన్ బ్యాంకు సమకూర్చింది. జిల్లాలో కొవ్వూరు డివిజన్‌ను పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసి ఈ మెషీన్లను అందించింది. పట్టణంలోని యువరాజ్ ఫంక్షన్ హాల్లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఈ మూడు పేటీఎం మెషీన్‌లను హోం మంత్రి తానేటి వనిత, ఎంపీ మార్గాని భరత్ రామ్ చేతుల మీదుగా సీసీలకు అందజేశారు. కలెక్టర్ కె.మాధవీలత, డీఆర్‌డీఏ పీడీ సుభాషిణి, స్త్రీ ఏజీఎం ధరేంద్ర, మేనేజర్ శ్రీనివాబు, ఏపీఎం రోజ్ మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు మండలంలో 375 మందికి కొత్త పెన్షన్లు

నిడదవోలు రూరల్: మండలంలోని 22 గ్రామ సచివాలయాల పరిధిలో 375 మందికి కొత్తగా వైఎస్సార్ పెన్షన్ కానుక మంజూరైనట్టు ఎంపీడీపీ పి.శామ్యూల్ తెలిపారు. మండలంలోని పందలపర్రు, సమిశ్రగూడెం, కంసాలిపాలెం, విజ్జేశ్వరం, కాటకోటేశ్వరం గ్రామాల్లో లబ్ధిదారులకు నూతన పెన్షన్ సొమ్ములను ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది బుధవారం అందజేశారు. సర్పంచులు కొండపల్లి శ్రీను, తిక్కా శ్రీను, సొసైటీ అధ్యక్షుడు గజ్జరపు శ్రీ రమేష్, వైఎస్సార్ సీపీ నాయకులు గుంటుపల్లి రామచంద్రరావు, కోసూరి అప్పారావు, గెద్దం రవీంద్ర, దేశాబత్తుల నాగు, వడలి అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆశాజనకంగా పొగాకు నారు

- రీ సెట్ చేస్తున్న రైతులు
- అక్టోబర్ మొదటి వారంలో నాట్లకు సన్నద్ధం
- పెరగనున్న సాగు విస్తీర్ణం



బుచ్చియపాలెంలో షేడ్ నెట్‌లో పెంచుతున్న పొగాకు నారును పరిశీలిస్తున్న బోర్డు అధికారులు



పల్లంట్లలో ఆశాజనకంగా ఉన్న పొగాకు నారుమడులు

దేవరపల్లి: పొగాకు నారుమడులు ఆశాజనకంగా ఉండడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. వాతావరణం అనుకూలించడంతో నారు ఆరోగ్యంగా ఉందని వారు చెబుతున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని మెట్ట ప్రాంతంలో ప్రధాన వాణిజ్య పంట వర్జీనియా పొగాకు. దాదాపు 60 వేల ఎకరాల్లో నాటేందుకు పొగాకు నారు అవసరం. పెద్ద రైతులు సొంతంగా నారు మడులు కట్టి నారును పెంచుతుండగా, చిన్న రైతులు వ్యాపారుల వద్ద కొనుగోలు చేసి నాటుకుంటారు. మెట్ట ప్రాంతంలో దాదాపు 1,200 ఎకరాల్లో నారు మడులు కట్టినట్టు అధికారుల అంచనా. అవసరమైన విత్తనాలను ఐటీసీ, సీటీఆర్ఐ సంస్థలు బోర్డు ద్వారా సరఫరా చేస్తున్నాయి. ప్రస్తుతం నారు నూటే దశ (రీ సెట్టింగ్)లో ఉంది.

ట్రే నారుకు రైతుల మొగ్గు

ట్రేలలో నారు పెంపకానికే రైతులు మొగ్గు చూపుతున్నారు. ఎక్కువ మంది రైతులు పొలాల్లో షేడ్ నెట్‌లు ఏర్పాటు చేసి నారును ప్లాస్టిక్ ట్రేలలో పెంచుతున్నారు. ఇలా పెంచిన నారుకు డిమాండ్ ఎక్కువ. అవసరమైన ట్రేలను రైతులకు పొగాకు బోర్డు సరఫరా చేసింది. ట్రే నారు ఆరోగ్యంగాను, దృఢంగా ఉంటుంది. పొలంలో నాటిన తర్వాత చీడపీడలను తట్టుకుంటుందని రైతులు తెలిపారు. ఎకరం విస్తీర్ణం నాటడానికి ఆరు వేల మొక్కలు అవసరం.

కలిసొస్తే కాసుల పంటే..

పొగాకు నారు సీజన్ కలిసి వస్తే రైతులకు కాసుల పంట పండుతుంది. డిమాండ్‌ను బట్టి నారు రేటు ఉంటుంది. పోసిన నారు దెబ్బ తినకుండా ఉంటే నారుకు అంతగా డిమాండ్ ఉండదు. రెండేళ్లుగా నారుకు మంచి డిమాండ్ ఏర్పడింది. ఎకరం విస్తీర్ణానికి సరిపడా నారు 2020–21లో రూ.17,000 రేటు పలకగా, గతేడాది రూ. 3500 నుంచి 4,500 పలికింది. అయినా కొద్దిపాటి లాభాలతో రైతులు బయట పడ్డారు. నారు మడులు కట్టిన వారిలో ఎక్కువ మంది కౌలుదారులే. ఎకరానికి రూ.50,000 నుంచి రూ.60,000 భూమి కౌలు రేటు పలుకుతుంది. ఎకరాకు సుమారు రూ.4 లక్షల వరకూ పెట్టుబడి అవుతుంది. వాతావరణం అనుకూలించకపోతే ఒక్క రోజులో నారుమడులు నిలువునా కుళ్లిపోతాయి. అధిక వర్షాల వల్ల నారుకు మానుమచ్చ, వేరు కుళ్లు వంటి తెగుళ్లు వ్యాపిస్తాయని రైతులు తెలిపారు.

అధిక దిగుబడులు వచ్చే వంగడాలు సాగు

అధిక దిగుబడులు వచ్చే వంగడాలను రైతులు సాగు చేస్తున్నారు. ఎకరాకు 12 నుంచి 13 క్వింటాళ్ల దిగుబడులు సాధిస్తున్నారు. ఎల్‌వీ–7 వంగడంతో పాటు మరికొన్ని నూతన వంగడాలను సాగు చేస్తున్నారు. కిలో విత్తనాలను రూ.16 వేలకు రైతులు కొనుగోలు చేస్తున్నారు.

భారీగా పెరగనున్న సాగు విస్తీర్ణం

2023–24 సీజన్‌లో పొగాకు సాగు విస్తీర్ణం భారీ పెరగనుంది. 2022–23 పంట సీజన్‌లో పొగాకు సాగుదారులు లాభాలు ఆర్జించారు. దాంతో ఈ ఏడాది పొగాకు సాగుపై రైతులు మక్కువ చూపుతున్నారు. పొగాకు సాగు కోసం రైతులు కొబ్బరి, జీడిమామిడి, ఆయిల్‌పామ్ వంటి తోటలను తొలగిస్తున్నారు. గతేడాది 55 మిలియన్ల కిలోల పొగాకు ఉత్పత్తి కాగా, ఎకరాకు సుమారు రూ.2.50 లక్షల నుంచి రూ.3 లక్షల వరకూ ఆదాయం వచ్చింది. వచ్చే సీజన్‌లో 65 మిలియన్ల కిలోల పొగాకు ఉత్పత్తి అవుతుందని అధికారులు అంచనా.

నారు ఆరోగ్యంగా ఉంది



పొగాకు నారుమడులు ఆశాజనకంగా ఉన్నాయి. రీసెట్టింగ్ చేస్తున్నారు. అక్టోబరు 5,6 తేదీల్లో నాట్లు ప్రారంభించడానికి రైతులు సన్నద్ధమవుతున్నారు. సాగు విస్తీర్ణం పెరగనుంది. దీని ప్రభావం మార్కెట్‌పై పడుతుంది. వచ్చే ఏడాది మార్కెట్ ఎలా ఉంటుందో తెలియదు.

– కరుటూరి శ్రీనివాస్, అధ్యక్షుడు, పొగాకు వేలం కేంద్రం, దేవరపల్లి

ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికే..

- 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం
- హోం మంత్రి తానేటి వనిత
- కొవ్వూరులో 109 వినతుల స్వీకరణ
- అర్హత కలిగిన ప్రతి అర్జీకి వారం లోగా పరిష్కారం



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న మంత్రి తానేటి వనిత, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్, కలెక్టర్ మాధవీలత, జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ తదితరులు

కొవ్వూరు: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి జగనన్నకు చెబుదాం అనే కార్యక్రమానికి రూపకల్పన చేశారని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. మండల స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని పట్టణంలోని యువరాజ్ ఫంక్షన్ హాల్లో బుధవారం సాయంత్రం నిర్వహించారు. ఎంపీ మార్గాని భరత్‌రామ్, కలెక్టర్ కె.మాధవీలతతో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా సమస్యలను మండల స్థాయిలోనే పరిష్కరిస్తామన్నారు. ప్రజలు పెట్టుకున్న అర్జీల్లో అర్హత కలిగిన ప్రతి అర్జీనీ వారం రోజుల్లో పరిష్కరిస్తామని మంత్రి ప్రకటించారు. ఎంపీ మార్గాని భరత్‌రామ్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం ప్రజలు జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. జిల్లా అధికారులే జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా ప్రజల దగ్గరకు వచ్చి వారి సమస్యలు తెలుసుకుని, పరిష్కారానికి చర్యలు తీసుకుంటారన్నారు. కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ బుధవారం నాటి కార్యక్రమంలో 109 అర్జీలు వచ్చాయన్నారు. ప్రభుత్వాదేశాల మేరకు ప్రతి బుధ, శుక్రవారాల్లో మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్ మాట్లాడుతూ ఈ రోజు స్వీకరించిన అర్జీలన్నీ ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామన్నారు. వాటి తదుపరి ప్రగతి, పురోగతిని తెలుసుకునేందుకు ప్రత్యేక సిబ్బందిని నియమించామన్నారు. అర్జీలను వారం రోజుల్లో పరిష్కరించకపోతే డివిజన్, మండల, గ్రామస్థాయి అధికారులు వ్యక్తిగత బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి, ఎంపీపీ కాకర్ల నారాయుడు, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ బండి పట్టాభి రామారావు, మునిసిపల్ కమిషనర్ బి.శ్రీకాంత్, ఎంపీడీవో కె.సుశీల, డ్వామా పీడీ పి.జగదాంబ, డీఎంహెచ్‌వో కె.వెంకటేశ్వరరావు, సీపీవో ఎం.ముఖలింగం, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మధవరావు, డీటీవో ఎస్.సత్యనారాయణ, డీఈవో ఎస్.అబ్రహాం, జిల్లా గృహనిర్మాణ శాఖాధికారి పరశురామ్, డీవోహెచ్‌వో ఎస్‌జీటీ సత్యగోవింద్, డీసీహెచ్‌ఎస్ ఎస్.సనత్‌కుమారి పాల్గొన్నారు.

ఖండవల్లిలో పౌష్టికాహార వారోత్సవాలు



కార్యక్రమంలో అంగన్‌వాడీలతో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్

పెరవలి: ఐసీడీఎస్ ఖండవల్లి సెక్టార్ పరిధిలోని ఐదు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల పౌష్టికాహార వారోత్సవాలను ఉమ్మడిగా బుధవారం ఖండవల్లిలో నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసే పౌష్టికాహారాన్ని విధిగా గర్భిణులు, బాలింతలు తీసుకునేలా చూడాలని అంగన్‌వాడీలకు సూచించారు. అప్పుడే తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లపై చర్యలు తప్పవని ఎంపీపీ హెచ్చరించారు. బాలింతలు, గర్భిణులు ఏయే ఆహారం తీసుకుంటే వారు ఆరోగ్యంగా ఉంటారో, ఆయా వంటకాలను తయారు చేసి వారోత్సవాల్లో ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు పిప్పర రవి, బొకే వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ నాయకుడు జగదీష్, కందా వెంకన్న, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, గర్భిణులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష బిల్వార్చన

నిడదవోలు: మాస శివరాత్రి సందర్భంగా బుధవారం స్థానిక బాలా త్రిపుర సుందరి సమేత సోమేశ్వర స్వామి వారి ఆలయంలో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు శ్రీకాకుళపు లక్ష్మీ నరసింహ శాస్త్రి, అర్చకులు శ్రీకాకుళపు అభిరామ్ ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారికి లక్ష బిల్వార్చన, అమ్మవారికి కుంకుమ పూజలు, లక్ష్మీ సహస్రనామం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ ఈవో సోమాల శివ తదితరులు పాల్గొన్నారు.

ఈఓపీఆర్‌డీగా వెంకటరమణ



వెంకట రమణకు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలుకుతున్న పంచాయతీ కార్యదర్శులు

పెరవలి: ఈఓపీఆర్‌డీగా సీహెచ్ వెంకటరమణ బుధవారం పెరవలిలో బాధ్యతలు స్వీకరించారు. గత ఆరు నెలలుగా ఈ పోస్టును ఇన్‌చార్జులతో నెట్టుకు వస్తున్నారు. వెంకటరమణ కృష్ణా జిల్లా ముదునేపల్లి మండలం నుంచి పెరవలి మండలానికి బదిలీపై వచ్చారు. విధుల్లో చేరిన ఆయనకు మండలంలోని పలువురు పంచాయతీల కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

చంద్రబాబు అవినీతే ఆయనకు చుట్టుకుంది

తాళ్లపూడి: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి అరెస్టు వెనుక రాష్ట్ర ప్రభుత్వం కుట్ర ఎంతమాత్రం లేదని, ఆయన ప్రభుత్వ హయాంలో చేసిన అవినీతే ఆయనకు చుట్టుకుందని ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, జెడ్పీ వైస్ చైర్మన్ పోశిన శ్రీలేఖ అన్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కాకర్ల వెంకటేశ్వరరావు అధ్యక్షతన తాళ్లపూడిలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. చంద్రబాబు అరెస్టుపై టీడీపీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వంపై చేస్తున్న ఆరోపణలను వారు తిప్పికొట్టారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ కాకర్ల వెంకటేశ్వరరావు, ఎంపీపీ పోశిరాజు, జెడ్పీ వైస్ చైర్మన్ శ్రీలేఖ తదితరులు మాట్లాడుతూ చంద్రబాబుపై చట్టబద్ధంగా కేసులు నడుస్తాయి తప్ప, వాటిలో వైఎస్సార్ సీపీ ప్రమేయం ఉండదన్నారు. గతంలో ఓటుకు నోటు కేసులో అక్రమాలకు పాల్పడిన చంద్రబాబు, ఇప్పుడు స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ స్కాంలో అడ్డంగా దొరికిపోయారన్నారు. కనీసం వార్డు మెంబర్లుగా కూడా గెలవలేని టీడీపీ నాయకులు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించడం తగదన్నారు. విలేకరుల సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు సిద్ధంశెట్టి కృష్ణ, ముప్పిడి దమయంతి, యాళ్ల బాబూరావు, కొలిశెట్టి నాగేశ్వరరావు, నక్కా చిట్టి బాబు, నూతంగి సురేష్, బంద్రెడ్డి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బురద చల్లడం మానుకోవాలి

కొవ్వూరు: చంద్రబాబు పక్కా ఆధారాలతో స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో దొరికి పోయి జైలుకి వెళితే టీడీపీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వంపై బురద చల్లడం, బుకాయింపులకు పాల్పడం మానుకోవాలని ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ (నారాయుడు) అన్నారు. వైఎస్సార్ సీపీ సమావేశాన్ని బుధవారం ఐ.పంగిడిలో నిర్వహించారు.నారాయుడు మాట్లాడుతూ ఇన్నాళ్లు చంద్రబాబు వ్యవస్థలను మేనేజ్ చేసుకుంటూ ఎన్ని కేసులున్నప్పటికీ స్టేలు తెచ్చుకుని కాలం నెట్టుకొచ్చారన్నారు. ఇప్పుడు కుదరలేదన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ బండి పట్టాభి రామారావు, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చొటుపల్లి వీరన్న, సోషల్ మీడియా కో–ఆర్డినేటర్ మారిన రామకృష్ణ, వైస్ ఎంపీపీ వీరమళ్ల నారాయుడు, దొమ్మేరు సొసైటీ అధ్యక్షుడు ముదునూరి సూర్యనారాయణరాజు, పలువురు సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ల వేతనాలు పెంచాలి

నల్లజర్ల: తమ వేతనాలు పెంచాలని ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు కోరారు. ఈ మేరకు మండలంలోని ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు బుధవారం ఎంపీడీఓ రాజశేఖర్‌ను నల్లజర్లలో కలసి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారికి నాయకత్వం వహించిన సీహెచ్ చైతన్య మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్ల కృషిని గుర్తించి కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎన్.యం.ఎస్ఎస్ యాప్‌లో వస్తున్న సాంకేతిక సమస్యల వల్ల చేసిన పనులకు కూలీల ఫొటోలు అప్‌లోడ్ కాక హాజరు శాతం తగ్గిపోతోందన్నారు. తద్వారా మేన్ డేస్ రీచ్‌కాక డీ గ్రేడ్ అవుతున్నామని వివరించారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు మేన్ డేస్ టార్గెట్ విధానాన్ని రద్దుచేయాలని, న్యాయమైన తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరారు.

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ



మట్టి గణనాథుని ప్రతిమలను పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ, రోటరీ సభ్యులు

నిడదవోలు: పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణకు మట్టి వినాయక ప్రతిమలనే పూజించాలని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. వినాయక చవితిని పురస్కరించుకుని రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో ప్రముఖ వ్యాపారవేత్త గమిని వీరన్నబాబు ఆర్థిక సహాయంతో బుధవారం మట్టి వినాయక ప్రతిమలను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు , పోలదాసు శ్రీనివాసరావు, గుంటుపల్లి శివకుమార్, కాళ్ళ రాంబాబు, గోపిరెడ్డి శ్రీనివాస్, ఆకుల రామచంద్రరావు, సాయి శ్రీనివాస్, అద్దాల సత్య ప్రభాకర్, గొన్నాబత్తుల రామారావు పాల్గొన్నారు.

19 నుంచి డీఎడ్ పరీక్షలు

నల్లజర్ల: ఉపాధ్యాయ శిక్షణ పొందుతున్న డీఎడ్ విద్యార్థులకు ఈ నెల19 నుంచి పరీక్షలు జరుగుతాయని దూబచర్ల డైట్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ పీవీ రమణమూర్తి బుధవారం తెలిపారు. 2021–23 బ్యాచ్ విద్యార్థులకు తుది (4వ సెమిస్టర్) పరీక్షలు ఈ నెల19 నుంచి 22 వరకూ రోజూ మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు నిర్వహిస్తారన్నారు. అలాగే 2022–24 విద్యా సంవత్సరం విద్యార్థులకు తొలి సెమిస్టర్ పరీక్షలు ఈనెల 19 నుంచి 25 వరకూ ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకూ నిర్వహిస్తామన్నారు. హాల్ టిక్కెట్లను విద్యార్థులు ఆన్‌లైన్‌లో డౌన్ లోడ్ చేసుకోవాలన్నారు.

మానవతావాది పాలనలో స్వర్ణయుగం



కొవ్వూరులో కొత్త పింఛన్లు పంపిణీ చేస్తున్న హోం మంత్రి తానేటి వనిత



దేవరపల్లిలో లబ్ధిదారులకు కొత్త పింఛన్లు అందిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



నిడదవోలులో కొత్త పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

- హోం మంత్రి తానేటి వనిత
- కొత్తగా మంజూరైన సామాజిక పింఛన్ల పంపిణీ

కొవ్వూరు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయవేత్తలా కాకుండా మానవతావాదిలా కులమతాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. ఇది నిజంగా పేదలకు స్వర్ణ యుగమని ఆమె అన్నారు. ఫేజ్–2 కింద కొత్తగా మంజూరైన పింఛన్ల పంపిణీ కార్యక్రమం బుధవారం స్థానిక మునిసిపల్ కార్యాలయం వద్ద జరిగింది. మంత్రి వనిత మాట్లాడుతూ ఏ కారణంగా చేతనైనా అర్హులకు పథకాల లబ్ధి అందకపోతే జల్లెడ పట్టి మరీ లబ్ధి చేకూరుస్తున్నామన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాం (2014–19 మధ్య)లో పింఛన్ల కోసం సగటున నెలకు ఖర్చు చేసింది రూ.400 కోట్లు మాత్రమే అని ఆమె అన్నారు. 2023 జనవరి నుంచి పింఛన్ల కోసం నెలకు రూ.1,800 కోట్ల చొప్పున జగన్ ప్రభుత్వం ఖర్చు చేస్తోందన్నారు. గతంలో మాదిరిగా పింఛన్ల కోసం నాయకుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, వైస్ చైర్ పర్సన్‌లు మన్నె పద్మ, గంధ్రోతు అంజనీదేవి, వైఎస్సార్ సీపీ పట్టణ శాఖ గౌరవాధ్యక్షుడు నగళ్లపాటి శ్రీనివాస్, శ్రీరామా సొసైటీ అధ్యక్షుడు అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర, కౌన్సిలర్లు తోట లక్ష్మీప్రసన్న, దేవగుప్తాపు చాందిని, పతివాడ నాగమణి, కమిషనర్ బి.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అవ్వాతాతల కళ్లలో ఆనందమే లక్ష్యం

నిడదవోలు: అర్హులైన ప్రతి ఒక్కరికీ సామాజిక పింఛన్లు మంజూరు చేసి అవ్వాతాతల కళ్లల్లో ఆనందం చూడడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఇష్టమని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. పట్టణ పరిధిలో కొత్తగా 230 సామాజిక పింఛన్లు మంజూరయ్యాయి. స్థానిక కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ హాలులో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో కొత్త పింఛన్లను ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. సమావేశంలో ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు మాట్లాడుతూ పట్టణంలో ప్రస్తుతం మంజూరైన కొత్త పింఛన్లతో కలిపి మొత్తం 4,336 మంది లబ్ధిదారుల కోసం వైఎస్సార్ పింఛన్ కానుక కింద ప్రతి నెలా ప్రభుత్వం రూ.1.20 కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి మద్దిపాటి ఫణీంద్ర, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గంగుల వెంకటలక్ష్మి, కౌన్సిలర్లు ఎస్కే వజీరుద్దీన్, కొత్తపల్లి సుప్రియ, అహ్మదున్నీసా బేగం, గోపిరెడ్డి శ్రీనివాస్, దాకే అనిల్‌కుమార్, మద్దిపాటి నాగశ్రీ తదితరులు పాల్గొన్నారు.

అర్హత ఉంటే ఇంటికే పింఛను వస్తోంది

దేవరపల్లి: జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అర్హత ఉంటే ఇంటికే పింఛన్ వస్తోందని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. లబ్ధిదారులకు కొత్తగా మంజూరైన వైఎస్సార్ పింఛను కానుకను బుధవారం సాయంత్రం ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద అందజేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కూచిపూడి సతీష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. 60 ఏళ్లు పైబడిన ప్రతి అవ్వాతాతలకు పింఛన్ మంజూరు చేస్తున్నామన్నారు. మండలానికి కొత్తగా 624 పింఛన్లు మంజూరైనట్టు తెలిపారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 44,180 మందికి సామాజిక పింఛన్లు ఇస్తుండగా, ఒక్క దేవరపల్లి మండలంలోనే 12,267 మంది ప్రతి నెలా పింఛన్లు పొందుతున్నారన్నారు. పేదల సంక్షేమం కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం పనిచేస్తున్నారని ఆయన్నారు. సంక్షేమంతో పాటు విద్య,వైద్య రంగాలకు ప్రభుత్వం పెద్దపీట వేసిందని తెలిపారు. సమావేశంలో ఎంపీపీ కేవీకే దుర్గారావు, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, సర్పంచ్ కడిమి వీరకుమారి, రాష్ట్ర పామాయిల్ బోర్డు డైరెక్టర్ నరహరిశెట్టి రాజేంద్రబాబు, వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మేడిబోయిన గంగరాజు, పార్టీ జిల్లా కార్యదర్శి ఆరేటి సూర్యనారాయణ, నియోజకవర్గ మహిళా కన్వీనర్ గారపాటి రమాప్రభ, మండల కన్వీనర్ కదలి హైమావతి, ఎంపీడీఓ డీబీఆర్ కృష్ణంరాజు, పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

గోపాలపురంలో..

గోపాలపురం: మండలానికి కొత్తగా 651 సామాజిక పింఛన్లు మంజూరయ్యాయి. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో వారికి ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పింఛను సొమ్ము అందించారు. ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ళ భాస్కరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతిరెడ్డి నాగరాజు, నాయకులు వెలగా శ్రీరామమూర్తి, కూసం రామమోహన్‌రెడ్డి, ఎస్‌కె వల్లీ, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు ఎంపీడీఓ ఆర్. శ్రీదేవి కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం పెన్షన్లను ఇంటికే అందిస్తోందని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు అన్నారు. మండల కేంద్రమైన ఉండ్రాజవరం పంచాయతీ పరిధిలో కొత్తగా 85 పింఛన్లు మంజూరయ్యాయి. స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో కొత్తగా మంజూరైన పింఛన్లను సర్పంచ్ మెండే వెంకట్రావుతో కలసి బూరుగుపల్లి సుబ్బారావు లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో గాదిరాజు రామకృష్ణంరాజు మాట్లాడుతూ మండలానికి కొత్తగా 492 పింఛన్లు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నరహరిశెట్టి సరోజిని, ఎంపీటీసీ సభ్యుడు గాడి కిషోర్, వైఎస్సార్ సీపీ నాయకులు దొనేపూడి సుధాకర్, దువ్వ సత్యనారాయణ, దొడ్డా కొండయ్య పాల్గొన్నారు. అలాగే పాలంగిలో సర్పంచ్ బిక్క శ్రీనివాస్, తాడిపర్రులో ఎంపీటీసీ సభ్యుడు కట్టా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

గోపాలపురంలో సెంట్రల్ లైటింగ్‌కు ప్రారంభోత్సవం



వైఎస్సార్ జంక్షన్ వద్ద సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తలారి

గోపాలపురం: దేవరపల్లి– తల్లాడ రోడ్డులో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్‌ను ఎమ్మెల్యే తలారి వెంకట్రావు బుధవారం గోపాలపురంలోని వైఎస్సార్ జంక్షన్ వద్ద ప్రారంభించారు. స్థానిక వై.జంక్షన్‌లోని వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకూ ఏర్పాటు చేసిన లైటింగ్ వల్ల రాత్రి వేళ రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, సొసైటీ అధ్యక్షుడు కూసం రామమోహన్‌రెడ్డి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ ముల్లంగి శ్రీనివాసరెడ్డి వైఎస్సార్ సీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు ఎం.శ్యామ్‌సుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.